క్లుప్తంగా

వెంకయ్యస్వామికి పూజలు

మనుబోలు: స్థానిక బీసీకాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హోమ గుండం వద్ద ధుని పూజ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు గంధళ్ల క్రిష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సబ్సిడీపై హైబ్రిడ్ జొన్న విత్తనాలు

ఇందుకూరుపేట: పాడి రైతులకు 75 శాతం సబ్సిడీపై హైబ్రిడ్ జొన్న విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ వి.కోటేశ్వరరావు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమం ఆవరణలో శనివారం రైతులకు మేలుజాతి పశుగ్రాసాల ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పశువులు, గొర్రెలు, మేకలకు వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను వివరించారు. అనంతరం రైతులకు జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ హరిబాబు, ఏహెచ్ఏ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల భోజన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యా విషయక పర్యవేక్షణ అధికారి సుధీర్‌బాబు ఉన్నారు.

ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు

వరికుంటపాడు: తెల్ల పశువుల్లో వచ్చే ముద్ద చర్మ వ్యాధి నివారణకు ఈ నెల 20 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు టీకాలు వేస్తున్నట్లు ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 450 వరకు ఆవులు, ఎద్దులు, లేగ దూడలు ఉన్నాయని తెలిపారు. వాటికి టీకాలను వేస్తున్నట్లు చెప్పారు. పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సీఎంపై అక్రమ కేసులు తగవు

ఆత్మకూరు: ప్రజల ఆదరాభిమానాలతో ఐదేళ్ల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి 40 శాతం ఓటు బ్యాంకు కలిగి ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమికి ప్రజలు ఒక అవకాశం ఇచ్చారని, దానిని సద్వినియోగం చేసుకుని ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలే తప్ప ఇలా అక్రమంగా కేసులు బనాయించడం మంచిపద్ధతి కాదన్నారు. కక్ష సాధింపుతో పాత కేసులు తిరగదోడి కేసులు నమోదు చేయడంపై రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఈసడించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసేలా వ్యవహరించాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆయన హితవుపలికారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై సీసీఎస్ పోలీసుల విచారణ

ఉదయగిరి: మండలంలో తెల్లరాయి అక్రమ తవ్వ కాలు, రవాణాపై సీసీఎస్ పోలీసులు శనివారం విచారణ చేపట్టారు. ముందుగా తెల్లరాయి అక్రమంగా తవ్వకాలు చేస్తున్న మాసాయిపేట, కొండాయపాళెం, అప్పసముద్రం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, తిరుమలాపురం, తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఇటీవల మండలంలో జరుగుతున్న తెల్లరాయి అక్రమ తవ్వకాలు, రవాణాపై డీజీపీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ సాంబశివరావు, ఏఎస్సై రవి ఉదయగిరి స్టేషన్‌కు చేరుకుని స్థానిక పోలీసులతో చర్చించారు. గతంలో నమోదు చేసిన కేసుల గురించి ఆరాతీశారు. తెల్లరాయి తవ్వకాలు, లీజు తదితర అంశాలపై చర్చించారు.

నేడు హనుమాన్ శోభాయాత్రపై సమావేశం

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 21న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి శోభాయాత్ర కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. హనుమాన్ శోభాయాత్రలో హిందువులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంట రుణాలను మాఫీ చేయాలి



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో పంట సాగు కోసం రైతులు తీసుకున్న పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని ఏపీ రైతుసంఘం నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. నగరంలోని సంతపేటలో ఉన్న రామకోటయ్య భవన్(సీపీఐ) కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి రైతుపై ఉన్న రూ.2 లక్షల 45 వేల రుణాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పాత గుర్తింపు కార్డులను రెన్యువల్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో రావల్సిన నగదును ఇవ్వాలని, రైతులకు 2020 సంవత్సరం నుంచి విద్యుత్ బిల్లులను రద్దు చేయాలని, సోమశిల ప్రాజెక్టు ఆఫ్రాన్ పనులను వెంటనే చేపట్టాలని, కౌలు రైతులకు అవసరమైన విత్తనాలను 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగపట్నం రమయణయ్య, షాన్‌వాజ్, రాజగోపాల్, రమణయ్య, మస్తాన్‌బాబు, మల్లికార్జున, వెంకటరమణయ్య, సుబ్బమ్మ, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై కొనసాగుతున్న దాడులు

- ఇద్దరు విక్రయదారుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరులో గంజాయి విక్రయదారులు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలులో ఏఎస్పీ సౌజన్య నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో ఇళ్ల వద్ద గంజాయి రవాణాదారులైన నెల్లూరు పెద్దబజారు కుమ్మరవీధికి చెందిన షేక్ షాహుల్ హమీద్ అలియాస్ షాహుల్, కోటమిట్ట మసీదు సమీపంలో నివాసం ఉంటున్న షేక్ అల్లాభక్షును నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని ఏఎస్పీ వెల్లడించారు. మరో నిందితుడిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి, ఎస్సైలు చంద్రావతి, రెహమాన్, సిబ్బంది ఆర్వీ రత్నయ్య, సురేంద్రబాబు, మస్తాన్, వేణు, మోహన్ బాబు, పి.వెంకటేశ్వర్లును ఏఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ క్రైమ్స్ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, నగర, సీసీఎస్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.రామకృష్ణాచారి, ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి పాల్గొన్నారు.

హామీ మేరకు తల్లికి వందనం ఇవ్వాలి

నెల్లూరు (టౌన్) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారో వారికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పారని గుర్తుచేశారు. దానిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి ఇవ్వాలని కోరారు.

19న రాజరాజేశ్వరికి శాకంబరి అలంకారం

నెల్లూరు(బృందావనం) : ఆషాడమాసం సందర్భంగా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 19వ తేదీన శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని దేవస్థానం ధర్మకర్త రత్నం జయరాం, ఈఓ జె.వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. వివిధ రకాల కాయగూరలు, ఫలాలతో దర్శనమిచ్చే అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పాస్టర్ల గౌరవ వేతనంపై స్పందించాలి

నెల్లూరు(బృందావనం) : పాస్టర్లకు అందజేస్తున్న గౌరవ వేతనం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని జిల్లా క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ రాజశేఖర్ దాసరి శనివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాస్టర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

21న కళానీరాజనం



కళా నీరాజనం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, రఘురామిరెడ్డి

నెల్లూరు(బృందావనం) : ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అరిగెపూడి కృష్ణకుమారి కళానీరాజనం' కార్యక్రమాన్ని నగరంలోని పురమందిరంలో ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామని ఆ సంఘ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. సుబేదారుపేటలోని ఆ సంఘ కార్యాలయం వద్ద కళానీరాజనం ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారంగానికి విశిష్ట సేవలందిస్తున్న అరిగెపూడి విజయకుమార్ సతీమణి కృష్ణకుమారి కళాకారుల సంక్షేమానికి చేసిన సేవలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. కళానీరాజనంలో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు కళాకారులకు పాటలు, డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకంగా నగదుతో పాటు షీల్డ్ అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమాలను అరిగెపూడి విజయకుమార్ సహకారంతో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ పర్యవేక్షణలో చేపడుతున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే గాయకులు, నృత్య కళాకారులు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో బి.రఘురామిరెడ్డి, వి.మహేష్, రాము, విశ్వేశ్వరప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

త్యాగరాజ మందిరంలో విశేష పూజలు



వేదపారాయణం చేస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని త్యాగరాజ నగర్‌లో ఉన్న త్యాగరాజ స్వామి మందిరంలో నెల్లూరు మండల వేదపరిషత్ 70 వసంతాల వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో 70 మంది వేద పండితులతో ఉదయం శాస్త్రోక్తంగా గణపతి పూజ జరిపించారు. అనంతరం వేద పండితులతో పారాయణాన్ని నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు బ్రహ్మశ్రీ భట్టారం శ్రీనివాసశర్మతో స్వస్తివాచనం, వేదప్రాశస్త్యంపై ఉపన్యాసం చేయించారు. వేదపారాయణం చేసిన 70 మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని నెల్లూరు మండల వేద పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఎనమండ్ర నాగదేవి ప్రసాద్, సభ్యులు మాచవోలు భాస్కరశర్మ, వెన్నెలకంటి శివకుమార్‌శర్మ, దుర్భా జనార్ధన్‌శర్మ, బండాత్మకూరు శేఖర్‌శర్మ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..



మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోవూరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించారు.

- రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఏపీఎన్‌జీజీఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజా రామకృష్ణ ఉన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు(అర్బన్) : వైద్యశాఖలో ఏఎస్ఎంలు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ కోరారు. ఈ మేరకు శనివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎస్ఎంలకు పెద్ద సంఖ్యలో యాప్‌లు పెంచారన్నారు. ఇందువల్ల ప్రజలకు సేవలందించడంలో జాప్యం జరిగి యాప్‌లలో అడిగిన వివరాలను నమోదు చేయడానికే సగం సమయం సరిపోతుందన్నారు. ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్(ముఖ హాజరు)లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు పనిచేసే చోట మాత్రమే జీతాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. 20 ఏళ్లుగా సేవలందిస్తూ చిన్న, చిన్న కారణాలతో రెగ్యులర్‌కు నోచుకోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. దీనిపై మంత్రి ఆనం మాట్లాడుతూ వైద్యశాఖ మంత్రి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హంస గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఇందిర, పరిమళ, జలీల్‌అహ్మద్, ఆసియాబేగం, సుమతి, అరుణ, రాణి, విజయబెనర్జీ, గౌస్‌బాషా, మాధవరావు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డిని కలిసిన 'హంస' నాయకులు

నెల్లూరు(అర్బన్) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ నాయకులు ఆమెకు సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హంస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ మాట్లాడుతూ కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట ప్రాంతాల్లో వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అండగా ఉండాలని కోరారు. హంస జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి మనుషులు కవితకు పురస్కారం



పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ రచించిన మట్టి మనుషులు కవితకు సాహితీ పురస్కారం లభించింది. నెల్లూరులోని పుర మందిరంలో శనివారం నిర్వహించిన పెన్నా రచయితల సంఘం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సుధీర్‌కుమార్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ తెలుగు శాఖాధిపతి మేడిపల్లి రవికుమార్, ఏపీ జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసులు, పెన్నా రచయితల సంఘం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

వెంకటాచలం: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ గాయపడిన ఘటన వెంకటాచలం మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో క్రిష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం జరిగింది. నెల్లూరు నుంచి క్రిష్ణపట్నం పోర్టు వైపునకు పొట్టు లోడుతో వెళుతున్న ట్రాక్టర్.. తాటిపర్తిపాళెం సమీపానికి చేరుకోగానే అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ పెంచలయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

రాంగ్ రూట్.. రైట్.. రైట్..!

నగరంలో ట్రాఫిక్ రోజురోజుకూ పెరిగిపోతోంది. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రధానంగా వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ, మద్రాస్ బస్టాండ్, బుజబుజనెల్లూరు సమీపంలోని జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో వాహనదారులు రాంగ్‌రూట్‌లో రాకపోకలు సాగిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(క్రైమ్)



కొత్త హాల్ సెంటర్, గాంధీబొమ్మ వద్ద రాంగ్‌రూట్‌లో రాకపోకలు





ఘనంగా పెరసం వార్షికోత్సవం



సోమేపల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

- 'ఆకురాలిన చప్పుడు'కు సాహిత్య పురస్కారం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరం ప్రాంగణం వర్ధమాన సమాజం హాల్లో 'పెన్నా రచయితల సంఘం' (పెరసం) 15వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన కవి వశిష్ట సోమేపల్లి కవితా సంపుటి 'ఆకురాలిన చప్పుడు'కు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి 'పెన్నా సాహిత్య పురస్కారం-2024' అందజేసి ఆయన్ను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఏపీజెన్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన 'సమకాలిన కవిత్వం-ప్రక్రియా వైవిధ్యం'పై తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ ఉపన్యసించారు. అలాగే పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి 'ఇటీవలి కవిత్వం-సమీక్షణం'పై ప్రసంగించారు. కవి, విమర్శకులు డాక్టర్ సుంకరగోపాల్ 'ఆకురాలు కాలం గ్రంథ సమాలోచన'పై ఉపన్యసించారు. అనంతరం నెల్లూరుకు చెందిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన 'పడమటి సూర్యోదయం' పుస్తకాన్ని రచయిత్రి సోమిరెడ్డి జయప్రద ఆవిష్కరించారు. న్యాయనిర్ణేతగా పెళ్లూరు సునీల్ వ్యవహరించారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, సభ్యులు మోపూరు పెంచలనరసింహం, అన్నం శివకృష్ణ, ఇంద్రగంటి మధుసూదన్ రావు, కె.అంకబాబు, మాధవ్, సుధ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి



జీపీఎస్ గెజిట్ పత్రాలను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (టౌన్) : రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక మాగుంట లేఅవుట్‌లోని జిల్లా యూటీఎఫ్ కార్యాలయం ముందు జీపీఎస్ గెజిట్ పత్రాలను శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడువక ముందే జీపీఎస్ చట్టాన్ని గెజిట్ రూపంలో విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పాత పెన్షన్ విధానం అమలుకు ప్రతిపాదనలు రూపొందించాలని, లేని పక్షంలో జీపీఎస్ రద్దు పోరాట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జీవీ శేషు, చలపతివర్మ, జిల్లా కార్యదర్శులు సురేంద్రబాబు, రవిబాబు, మండల నాయకులు అమర్‌నాథ్, సుబ్రహ్మణ్యం, పార్వతీశం, రామ్మోహన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



బీచ్ కబడ్డీ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : ఆగస్టు 2, 3, 4 తేదీల్లో ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో ఆమె శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఆగస్టు 2, 3, 4 తేదీల్లో జరిగే ఈ పోటీలను ప్రజలందరూ విజయవంతం చేయాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో కబడ్డీ పోటీలు జరుగుతాయని, క్రీడాభిమానులు తప్పకుండా పాల్గొని, విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన సర్జరీ



రోగి ప్రతాప్‌తో న్యూరో సర్జన్ దినేష్

నెల్లూరు(అర్బన్) : తాటి చెట్టుపై నుంచి కిందపడి వెన్నెముక, పక్కటెముకలు విరిగిపోయిన ఓ వ్యక్తికి అరుదైన కీ హోల్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ గంగపట్నం దినేష్ తెలిపారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో కోలుకున్న పేషెంట్‌తో కలిసి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదు రోజుల క్రితం విడవలూరు మండలం ఊటుకూరు-కంచరపాళేనికి చెందిన ప్రతాప్ గ్రామంలో తాటిచెట్టుపై నుంచి కింద పడ్డారన్నారు. పక్కటెముకలు, వెన్నెముక విరిగిపోయి నడవలేని స్థితిలో ఉన్న ఆయన్ను భార్య మాధవి, బంధువులు తమ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. ఇక్కడ అన్ని పరీక్షలు చేసి విరిగిన పక్కటెముకలను, వెన్నెముకను ఆపరేషన్ ద్వారా సరి చేయగలమని నిర్ధారణకు వచ్చామన్నారు. ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని అధునాతన కీ హోల్ సర్జరీ ద్వారా కండరాలకు కోత లేకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసి విరిగిన ఎముకలను సరి చేశామన్నారు. రోగిని డిశ్చార్జి చేశామని పరిపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఇంటికి వెళ్తున్నాడన్నారు.